111 ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284



**జరిగిన కథ :** ఒకనాడు రాజప్రాసాదంలో నియోగ విభాగాలను పరికిస్తూ ముందుకుపోతున్న జాయచోడుణ్ని.. 'నమస్తే.. జాయచోడ సాహిణుల వారికి..' అంటూ ఎవరో పలకరించారు. పూర్తిగా కొత్త ముఖం! 'రాయప్రోలు సూరంబొట్లు మమ నామధేయం. మహామండలేశ్వరులకు సూతునిగా నియమించారు!' అంటూ చెప్పాడు.

'సూతుడా!?'.. ఎక్కడో ఈ సూత పదం చదివినట్లు..

ఆయన నవ్వి..

''ఆశ్చర్యపోకండి. సూతుడు అంటే ధర్మపన్నాలు చెప్పేవాడని అర్థం. అంటే మహారాజులవారి వెంట ఉంటూ సందిగ్ధ సమయాల్లో ఏ నిర్ణయం తీసుకోవాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయో పరిశీలించి.. వాటిలో సూక్ష్మార్థాలను వివరించి వారి ముందు పరచడమే మా నియోగం..''

ఇలాంటి ఏవేవో కొత్తకొత్త నియోగాలు బావగారు ఎప్పుడూ ఏర్పాటు చేస్తూనే ఉంటారు. అప్పుడే మరో నియోగమందిరం నుంచి ఇద్దరు నియోగులు జాయచోడుణ్ని చూసి గుర్తించి పరుగున వచ్చారు.

''జాయసేనానుల వారికి ప్రణామాలు..'' ఒకరు అంటుండగా.. మరొకరు జాయచోడుని కాళ్లపై పడ్డాడు.

''నన్ను గుర్తుపట్టారా.. నేను శుక్ర.. చతుష్పథం వద్ద.. నేనే..''

గుర్తించాడు జాయచోడుడు. శుక్ర! చతుష్పథం వద్ద చర్చల్లో ప్రముఖ విశ్లేషకుడు.. ఆ రోజుల్లో!

అప్పుడు గ్రామీణ యువకుడు. సాధారణ పంచెకట్టు, కంచుకం.. ఇప్పుడు వయసు పైబడింది. ఆహార్యంలో రాచరిక నియోగ అధికార హోదా. చటుక్కున లేవనెత్తి హత్తుకున్నాడు.

''శుక్రా.. ఎన్నాళ్లకెన్నాళ్లకు..''

శుక్ర ఆనందబాష్పాలు కారుస్తున్నాడు.

''మీ ఎదుగుదల అంతా చూస్తూనే ఉన్నాను జాయచోడదేవా..''

అతని ముందు అప్పుడు చిన్న పిల్లవాడు తను.

నవ్వి..

''నీకు కూడా జాయచోడ దేవుణ్నేనా.. శుక్రా!! అప్పటిలాగే 'జాయా!' అని పిలువు చాలు..''

''మీకు ఈయన్ను పరిచయం చెయ్యాలి. ఈయన వరాహభట్టు. గుర్తుపడతావా జాయా.. అప్పట్లో పిల్లవాడు. నీ వయసే. చతుష్పథం వద్ద మన కబుర్లు, చర్చలు వినడానికి నిత్యమూ వచ్చేవాడట. ఇప్పుడు చక్రవర్తుల వారికి ఆర్థిక సలహాదారు. అక్కడ మన చర్చల వల్ల ఉత్తేజం పొంది ఉత్తరాన విక్రమశిల విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం చదువుకుని వచ్చాడట. నన్ను వెదికి పట్టుకుని చక్రవర్తులవారికి చెప్పి ఇక్కడో నియోగం ఏర్పరచి నన్ను దానికి అధికారిని చేశాడు..''

అబ్బురంగా చూశాడు జాయచోడుడు. అప్పుడు మిత్రుల కబుర్లు, చర్చలకు దారినపోయే దానయ్యలు ఎందరో చెవి కోసుకునేవారు. అందులో ఈ కుర్రాడు ఒకడన్నమాట. చతుష్పథం గుర్తుచేస్తే ప్రాణం లేచి వస్తుంది.

''అప్పట్లో రాజనగరి వార్తలు ప్రజలకు చేర్చగా.. ప్రజలు ఏం అనుకుంటున్నారనేది రాజనగరికి చేరితే.. పరిపాలన బావుంటుందని చక్రవర్తులవారు సంఘీయుల నియోగం ఏర్పరచారు. ఈ వరాహుడు నన్ను వెదకి దానికి నియోగాధికారిగా నియమించాడు''.

''విదేశీ వార్తలు తెలిపేవారు జాంఘీయులు కాబట్టి సంఘంలోని వార్తలను వివరించేవారు సంఘీయులు. బాగు బాగు'' అన్నాడు జాయచోడుడు.

ఇలాంటివే మరికొన్ని నియోగాలు కనిపిస్తున్నాయి. నీటిపారుదల నియోగం, ఖనిజాల నియోగం, వాతావ